క్లుప్తంగా

నేత్రదానం

నెల్లూరు(అర్బన్): వెంకటేశ్వరపురానికి చెందిన సుబ్బమ్మ (79) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. ఈ క్రమంలో కుటుంబసభ్యుల అంగీకారంతో ఆమె నేత్రాలను మోడరన్ ఐ ఆస్పత్రి టెక్నీషియన్ సేకరించారు. ఈ సందర్భంగా నేత్రదాత మోటివేటర్, హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ చైర్మన్ కుంచాల విజయభాస్కర్ మాట్లాడారు. నేత్రదానాన్ని ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని కోరారు. అనంతరం నేత్రదాత కుటుంబీకులకు సర్టిఫికెట్‌ను అందజేశారు.

ఇసుక రీచ్‌లలో భారీ దోపిడీ

నెల్లూరు సిటీ: సర్వేపల్లి నియోజకవర్గంలోని సూరాయపాళెం, విరువూరు రీచ్‌లలో రూ.91 కోట్ల దోపిడీ తేలిందని, ఇది పదో వంతు మాత్రమేనని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆరోపించారు. నగరంలోని టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. గత ఐదేళ్లలో జరిగిన దోపిడీపై సమగ్ర విచారణ జరిపితే వందల కోట్ల అవినీతి తేలుతుందని చెప్పారు.

ఆశ వర్కర్‌ను విధుల్లోకి తీసుకోవాలి

నెల్లూరు(దర్గామిట్ట): కలిగిరి మండలం రావులకొల్లు ఆశ వర్కర్ పందిటి విజయమ్మను అకారణంగా విధుల నుంచి తొలగించడాన్ని నిరసిస్తూ కలెక్టరేట్ వద్ద రిలే దీక్షలను ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టారు. దీక్షలను ప్రారంభించిన అనంతరం సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అజయ్‌కుమార్, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి రెహనాబేగం మాట్లాడారు. దళిత మహిళైన విజయమ్మ 18 ఏళ్లుగా విధులు నిర్వర్తిస్తున్నారని చెప్పారు. రాజకీయ కక్ష సాధింపుల్లో భాగంగా ఈమెను వేధిస్తూ, అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి ఆ గ్రామ సర్పంచ్ తొలగించారని ఆరోపించారు. ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విజయలక్ష్మి, దుగ్గిరాల అన్నపూర్ణమ్మ, జిల్లా కోశాధికారి మధుసూదన, సీఐటీయూ జిల్లా నేతలు అల్లాడి గోపాల్, పెంచలనరసయ్య, కేవీపీఎస్ జిల్లా నేత భాస్కర్, మేరీ, గౌసియా, ఉషా, రేణుక తదితరులు పాల్గొన్నారు.

కండలేరు జలాలను అందించాలని వినతి

నెల్లూరు(దర్గామిట్ట): రాపూరు మండలంలోని చెరువులకు కండలేరు జలాలను అందించాలని బీజేపీ నేత మిడతల రమేష్ కోరారు. ఈ మేరకు తెలుగుగంగ ఎస్‌ఈ రమణారెడ్డికి నగరంలోని ఆయన కార్యాలయంలో వినతి పత్రాన్ని శుక్రవారం అందజేశారు.

సీఐడీ ఇన్‌స్పెక్టర్ల బాధ్యతల స్వీకరణ

నెల్లూరు(క్రైమ్): సీఐడీ ఇన్‌స్పెక్టర్లుగా మధుబాబు, రాజేష్ దర్గామిట్టలోని కార్యాలయంలో బాధ్యతలను స్వీకరించారు. వీరికి పుష్పగుచ్ఛాలను సిబ్బంది అందజేశారు.

సోలార్‌తో ఉచిత వెలుగులు

- పీఎం సూర్యఘర్‌తో ఇంటింటా సౌరకాంతులు
- విద్యుత్ కోతలు, లో ఓల్టేజీ సమస్యలకు చెక్
- సోలార్ ప్యానళ్లతో విద్యుదుత్పత్తి
- జిల్లాలో 13,010 దరఖాస్తులు
- 65 భవనాల్లో ఇప్పటికే ఏర్పాటు



సోలార్ రూఫ్‌టాప్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ప్రతి ఇంట నిరంతర విద్యుత్ కాంతులుండాలనే లక్ష్యం.. సోలార్ విద్యుదుత్పత్తిని ప్రోత్సహించేలా పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజనను కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోంది. దీని ద్వారా భవన పైభాగంలో సోలార్ రూఫ్‌టాప్ ప్యానళ్లను ఏర్పాటు చేసుకొని సొంతంగా విద్యుదుత్పత్తి చేసి వినియోగించే వెసులుబాటు ఉంది. సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటుకు సబ్సిడీని ఇస్తుండటంతో ఈ పథకానికి విశేష స్పందన లభిస్తోంది.

ఉమ్మడి జిల్లాలో దరఖాస్తులిలా..

పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన కోసం జిల్లాలో 13,010 మంది ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో ఇప్పటికే 65 మంది వారి భవనాలపై రూఫ్‌టాప్ ప్యానళ్లను ఏర్పాటు చేసి సోలార్ విద్యుత్‌ను పొందుతున్నారు. ఈ పథకం ద్వారా రాయితీలు గృహ వినియోగదారులకు మాత్రమే వర్తిస్తాయి.

ఇదీ ఏర్పాటు ప్రక్రియ..

పీఎం సూర్యఘర్ పథకం ద్వారా దరఖాస్తు చేసుకొని మంజూరైన వినియోగదారుల గృహాలపై సోలార్ ప్యానళ్లను ఏర్పాటు చేస్తారు. భవన పైభాగంలో 100 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసే కిలోవాట్ రూఫ్‌టాప్ కోసం 3, 4 సోలార్ ప్యానళ్లను అమరుస్తారు. ప్రస్తుతం వాడే మీటర్ స్థానంలో నెట్‌మీటర్‌ను ఏర్పాటు చేసి దాని ద్వారా సోలార్ ఉత్పత్తి, వినియోగాన్ని లెక్కిస్తారు. వినియోగించగా మిగిలిన విద్యుత్‌ను గ్రిడ్లకు సరఫరా చేసి ఆదాయం పొందేందుకు వీలుంటుంది.

సోలార్ రూఫ్‌టాప్ సామర్థ్యం	ఉత్పత్తయ్యే యూనిట్లు (నెలకు)	ఏడాదికి ఆదా (సుమారు)	ప్రభుత్వ రాయితీ
ఒక కిలోవాట్	120	రూ.8 వేలు	రూ.30 వేలు
రెండు కిలోవాట్లు	240	రూ.20 వేలు	రూ.60 వేలు
మూడు కిలోవాట్లు	360	రూ.32 వేలు	రూ.78 వేలు

పథకాన్ని ఇలా పొందవచ్చు..

- పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజనను పొందేందుకు గృహ వినియోగదారులు వాడే విద్యుత్ యూనిట్లు 300లోపు ఉండాలి.
- సూర్యఘర్ యాప్‌ను మొబైల్‌లో ఇన్‌స్టల్ చేసుకోవాలి.
- ఆన్‌లైన్లో వినియోగదారుడి వివరాలను నమోదు చేసుకోవాలి.
- ఆర్నెల్ల బిల్లులను జత చేయాలి.
- అవసరమైన కిలోవాట్ల బట్టి రిజిస్ట్రేషన్ ఫీజును చెల్లించాల్సి ఉంటుంది.
- మూడు కిలోవాట్లలోపు సర్వీస్‌కు ఎలాంటి రిజిస్ట్రేషన్ ఫీజును చెల్లించాల్సిన అవసరం లేదు.
- ఐదు కిలోవాట్లకు రూ.1900.. ఆపై రూ.5,900.. పది కిలోవాట్లుపైబడిన హెచ్‌టీ సర్వీసులకు రిజిస్ట్రేషన్ ఫీజు రూపంలో రూ.11,900ను చెల్లించాల్సి ఉంటుంది.
- సబ్సిడీ పోనూ మిగిలిన మొత్తానికి బ్యాంకులు రుణ సదుపాయాన్ని కల్పిస్తాయి. వాయిదాల పద్ధతిలో చెల్లించేందుకు వెసులుబాటు ఉంటుంది.

సబ్సిడీ నగదు జమ

సూర్యఘర్ ప్యానళ్లను ఏర్పాటు చేసిన 30 రోజుల్లో వినియోగదారుల బ్యాంక్ ఖాతాల్లో కేంద్ర ప్రభుత్వం అందజేసే సబ్సిడీ నగదు జమవుతుంది. సోలార్ ప్యానళ్ల ఏర్పాటుకయ్యే పెట్టుబడి ఆరేడేళ్లలో తిరిగొస్తుంది.

విశేష స్పందన లభిస్తోంది



పీఎం సూర్యఘర్ పథకానికి విశేష స్పందన లభిస్తోంది. ఆన్‌లైన్లో దరఖాస్తులు ఎక్కువగా వస్తున్నాయి. సోలార్ ప్యానళ్లను ఏర్పాటు చేసుకున్న వినియోగదారులు నిరంతర విద్యుత్‌ను పొందవచ్చు. రూఫ్‌టాప్ ఏర్పాటు, విద్యుత్ సమస్యల పరిష్కారాల కోసం టోల్ ఫ్రీ నంబర్ 1912ను సంప్రదించొచ్చు.

– విజయన్, ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్‌ఈ

సూర్యఘర్ ద్వారా ఆదాయం పొందండి



పీఎం సూర్యఘర్ పథకం ద్వారా సోలార్ ప్యానళ్లను ఏర్పాటు చేసుకొని విద్యుత్ వాడే వారికి సరఫరాలో అంతరాయాలు, లో ఓల్టేజీ సమస్యలు రావు. మిగిలిన సోలార్ విద్యుత్‌ను గ్రిడ్లకు అనుసంధానం చేసి విక్రయించేందుకు వీలుంటుంది. పెట్టుబడి ఆరేడేళ్లలో తిరిగొస్తుంది.

– శ్రీధర్, నెల్లూరు టౌన్ ఈఈ

కొండా సురేఖ దిష్టిబొమ్మ దహనం

నెల్లూరు(బృందావనం): అక్కినేని కుటుంబంపై అసత్య ఆరోపణలు చేసిన తెలంగాణ మంత్రి కొండా సురేఖ దిష్టిబొమ్మను నగరంలోని న్యూటాకీస్ సెంటర్‌లో శుక్రవారం దహనం చేశారు. నాగార్జున ఫ్యాన్స్ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్‌రావు, రమేష్‌బాబు, శివ, నారాయణ, ప్రవీణ్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు సిటీ: అక్కినేని కుటుంబంపై కొండా సురేఖ వ్యాఖ్యలను నాగార్జున అభిమానుల సంఘ నేత నాగూర్ నాగార్జునరెడ్డి ఖండించారు.

త్వరలో రీ సర్వే ప్రాజెక్టు

నెల్లూరు(దర్గామిట్ట): రీ సర్వే ప్రాజెక్టును ప్రభుత్వం అమలు చేయనుందని జేసీ కార్తీక్ పేర్కొన్నారు. ఈ మేరకు తన చాంబర్‌లో విలేకరులతో మాట్లాడారు. ఏపీ రీ సర్వే ప్రాజెక్టును స్పష్టమైన విధివిధానాలతో ప్రారంభించామని తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్లు ప్రత్యేక మేజిస్ట్రేట్ అధికారాలతో గ్రామస్థాయిలో ఉన్న భూములను రీ సర్వే చేయనున్నారని పేర్కొన్నారు.

చురుగ్గా సభ్యత్వ నమోదు

నెల్లూరు(బారకాసు): రాష్ట్రంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చురుగ్గా సాగుతోందని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాకాటి నారాయణరెడ్డి పేర్కొన్నారు. మినీబైపాస్ రోడ్డులోని పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడారు. గాంధీబొమ్మ సెంటర్‌లో శనివారం నిర్వహించనున్న పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ హాజరుకానున్నారని చెప్పారు. నేతలు వంశీధర్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, సురేంద్రరెడ్డి, ఆంజనేయరెడ్డి, విజయ్‌కుమార్, రాజేష్, యశ్వంత్‌సింగ్, రాధాకృష్ణ, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలి



కాకాణి గోవర్ధన్‌రెడ్డితో సూళ్లూరుపేట నియోజకవర్గ నేతలు

- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు(బారకాసు): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని మాజీ మంత్రి, పార్టీ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. కాకాణిని డైకస్‌రోడ్డులోని ఆయన నివాసంలో సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, డీసీసీబీ మాజీ అధ్యక్షుడు కామిరెడ్డి, మండల కన్వీనర్లు తదితరులు శుక్రవారం కలిసి అభినందనలను తెలియజేశారు. ఎప్పుడు ఎన్నికలొచ్చినా, సూళ్లూరుపేట ఎమ్మెల్యేగా కిలివేటి సంజీవయ్యను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు.

మాస్టర్ ప్లాన్ మేరకు నగరాభివృద్ధి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): మాస్టర్ ప్లాన్ మేరకు నెల్లూరును సమగ్రంగా అభివృద్ధి చేస్తామని మంత్రి నారాయణ పేర్కొన్నారు. నగరంలోని 3, 4, 5వ డివిజన్లో అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి శుక్రవారం పర్యటించిన ఆయన మాట్లాడారు. డివిజన్లలో కొన్ని ప్రాంతాలు బాగుంటే, మరికొన్ని అపరిశుభ్రంగా ఉన్నాయనే అంశాన్ని గుర్తించామని చెప్పారు. వీటిని వెంటనే శుభ్రపర్చాలని ఆదేశించారు. ఖాళీ స్థలాల్లో వ్యర్థాలు, చెట్లను తొలగించేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

జీఓ 42ను రద్దు చేయరూ..

నెల్లూరు (టౌన్): ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకుల పదోన్నతులకు సమస్యగా మారిన జీఓ నంబర్ 42ను రద్దు చేయాలని జీసీటీఏ, జీసీజీటీఏ నేతలు కోరారు. ఈ మేరకు మున్సిపల్ శాఖ మంత్రి నారాయణకు విజయవాడలో వినతిపత్రాన్ని అందజేశారు. జీసీటీఏ అధ్యక్షుడు శ్రీరామ్మూర్తి, కార్యదర్శులు వెంకట్రావు, రామ్‌ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాయింట్ - 1 సబ్ రిజిస్ట్రార్‌గా విజయరాణి

నెల్లూరు సిటీ: నెల్లూరు ప్రధాన స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ కార్యాలయ జాయింట్ – 1 సబ్ రిజిస్ట్రార్‌గా విజయరాణిని నియమిస్తూ ఉత్తర్వులను ప్రభుత్వం శుక్రవారం జారీ చేసింది. నెల్లూరు ఆర్వో కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న సీనియర్ అసిస్టెంట్ సింహాద్రినాయుడ్ని జాయింట్ – 2 ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా నియమించారు.

ఏడు నుంచి అంతరిక్ష వారోత్సవాలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు (టౌన్): నగరంలోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో అంతరిక్ష వారోత్సవాలను షార్ ఆధ్వర్యంలో ఈ నెల ఏడు నుంచి తొమ్మిది వరకు నిర్వహించనున్నామని అక్కడి శాస్త్రవేత్త శ్రీకాంత్ పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను కళాశాలలో శుక్రవారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. జిల్లాలో 8, 9 తరగతులు చదివే వారు, ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్ విద్యార్థులు హాజరుకానున్నారని వెల్లడించారు. ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి, ప్రోగ్రామ్ కన్వీనర్ మురళి, కిశోర్, ఏజీఎం శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

తనిష్క్ గోల్డ్ షోరూమ్ ప్రారంభం



నెల్లూరు(బృందావనం): తనిష్క్ గోల్డ్ షోరూమ్‌ను అన్నమయ్య సర్కిల్ వద్ద శుక్రవారం ప్రారంభించారు. ముఖ్యఅతిథులుగా నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత, అడ్వొకేట్ మలిరెడ్డి కోటారెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా టైటాన్ కంపెనీ లిమిటెడ్ జ్యువెలరీ డివిజన్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శరద్ మాట్లాడారు. ప్రతి కొనుగోలుతో గోల్డ్ కాయిన్‌ను అందజేస్తున్నామని వివరించారు. ఈ ఆఫర్ ఆదివారం వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. టైటాన్ కంపెనీ రీజినల్ బిజినెస్ మేనేజర్ వాసుదేవరావు, ఏబీఎం పూర్ణచంద్రరావు, స్టోర్ మేనేజర్ రాంబాబు, ఫ్రాంచైజీ పార్ట్‌నర్స్ మహిధర్‌రెడ్డి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.



రాజరాజేశ్వరి ఆలయంలో భవానిగా అమ్మవారు



ఇరుకళల పరమేశ్వరి ఆలయంలో..



వేదగిరిలో..



సీతారామస్వామి మందిరంలో..



మూలస్థానేశ్వరాలయంలో..

పాహిమాం.. రక్షమాం

నెల్లూరు(బృందావనం): శరన్నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకొని నగరంలోని అమ్మవారి ఆలయాల్లో విశేష పూజలను నిర్వహిస్తున్నారు. జగన్మాత విశేషాలంకారాల్లో దర్శనమిస్తున్నారు. ఆలయాల్లో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

- రాజరాజేశ్వరి ఆలయంలో అమ్మవారు భవానిగా దర్శనమిచ్చారు. ప్రత్యేక పుష్పాలంకారంలో నేత్రపర్వంగా కొలువుదీరారు. ఉభయకర్తలుగా మాగుంట సోదరులు, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, సరిత, తోట దామోదర్, శోభారాణి దంపతులు వ్యవహరించారు.
- సింహపురి గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారు అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా చంద్రశేఖర్‌ఆచారి, శివప్రసన్న, సాయికుమార్, ప్రసన్నకుమార్, సావిత్రమ్మ, చైతన్య, పద్మజ తదితరులు వ్యవహరించారు.
- మూలాపేటలోని ద్రౌపతీదేవి సమేత కృష్ణ ధర్మరాజస్వామి దేవస్థానంలో అమ్మవారు మహాలక్ష్మిగా దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా ఆరంబాకం కృష్ణసింహ సోదరులు వ్యవహరించారు.
- నవాబుపేటలోని ద్రౌపతీదేవి సమేత కృష్ణ ధర్మరాజస్వామి దేవస్థానంలో అమ్మవారు గాయత్రీదేవిగా దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా బుజ్జయ్య, జానకి దంపతులు వ్యవహరించారు.
- స్టోన్‌హౌస్‌పేటలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారు బాలాత్రిపురసుందరిగా దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా శేగు షణ్ముగరావు, వాణి, మహేంద్రకుమార్, రాజ్యలక్ష్మి దంపతులు వ్యవహరించారు.
- మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారు భువనేశ్వరిగా దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా అభిమన్యు, సత్యవతి, నందకిషోర్‌రెడ్డి, శ్రీసుధ, జగదీష్‌రెడ్డి, మైథిలీ దంపతులు వ్యవహరించారు.
- ఉస్మాన్‌సాహెబ్‌పేటలోని కోదండరామపురంలో గల మహాలక్ష్మి దేవస్థానంలో అమ్మవారు భవానిగా దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా కాటేపల్లి వెంకటరమణయ్య, సరిత, బింగిమళ్ల రాజేష్, హరిత, శ్రీరామ్‌సుబ్బారావు, సౌభాగ్యవతి, కొండమూరు వెంకటరమణ, ఉమా, నీలి వెంకటనారాయణ, కామాక్షి దంపతులు వ్యవహరించారు.



అష్టలక్ష్మి మందిరంలో..

- బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో అమ్మవారు అన్నపూర్ణగా దర్శనమిచ్చారు. అభిషేకం, ధనలక్ష్మీ హోమం, కుంకుమపూజ, అష్టలక్ష్మీ వైభవాన్ని నిర్వహించారు. ఉభయకర్తలుగా చిట్లూరి వెంకటేశ్వర్లు, ఝాన్సీలక్ష్మి దంపతులు వ్యవహరించారు
- విరాట్‌నగర్‌లోని వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో బాలాత్రిపురసుందరిగా అమ్మవారు దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా పాలూరు ఈశ్వరయ్య, కుసుమ దంపతులు వ్యవహరించారు.
- మహాత్మాగాంధీనగర్‌లోని కృష్ణ మందిరంలో గల వైభవలక్ష్మి ఆలయంలో అమ్మవారు సౌభాగ్యలక్ష్మిగా దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా పాలూరు విజయకుమార్, సుహాసిని, వింజం రామలింగయ్య, సరస్వతి వ్యవహరించారు.
- నవాబుపేటలోని భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానంలో భవానీదేవిగా దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా గోళ్ల మధుసూదన్‌రావు దంపతులు వ్యవహరించారు.
- సుజాతమ్మకాలనీలోని అష్టలక్ష్మి మందిరంలో అమ్మవారు రాజరాజేశ్వరిగా దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా వెంకటరత్నం, ప్రతిమ, సురేంద్రకుమార్, పద్మావతి దంపతులు వ్యవహరించారు.



కన్యకాపరమేశ్వరి ఆలయంలో..

- సంతపేట కంసాలివీధిలోని భ్రమరాంబ సమేత హరిహరనాథస్వామి దేవస్థానంలో అమ్మవారు రాజరాజేశ్వరిగా దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా తెలనాకుల లక్ష్మీకాంతమ్మ వ్యవహరించారు.

నెల్లూరు సిటీ: నరసింహకొండపై వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఆదిలక్ష్మి అమ్మవారు ధాన్యలక్ష్మిగా దర్శనమిచ్చారు. విశేష పూజలను ప్రధానార్చకుడు భాస్కరాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈఓ వేమూరి గోపీ, అర్చకులు కృష్ణమాచార్యులు, రాఘవాచార్యులు పాల్గొన్నారు.



మల్లేశ్వరస్వామి ఆలయంలో..



మహాలక్ష్మి దేవస్థానంలో..



ధర్మరాజస్వామి దేవస్థానంలో..



వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో..



వైభవలక్ష్మి ఆలయంలో..